

మనసున మనసై.. బతుకున బతుకై..!
చూపులతో మొదలై..హృదయంలో స్థానం సంపాదించి..రెండు మనసులు పెనవేసుకుని తాళి బంధంతో ఒక్కటయ్యే ప్రేమ జంటల జీవితం ఆద్యంతం ఆనందాల హరివిల్లులా సాగిపోతుందనడంలో అతిశయోక్తి లేదు.
- 8లో



అర్జీలు గడువులోగా పరిష్కరించాలి
'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో అందిన వినతులు పెండింగ్ పెట్టకుండా గడువులోగా పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
- 8లో



ముగిసిన నాటిక పోటీలు
నాటకశాల– అభినయ సంయుక్త నిర్వహణలో నటరత్న నాటక పరిషత్ ఆధ్వర్యంలో 7వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు గురజాడ కళాభారతి ఆడిటోరియంలో సోమవారం రాత్రి ముగిశాయి.
- 8లో

న్యూస్‌రీల్

ఆర్థిక అక్షరాస్యత అవసరం
● కలెక్టర్ నిషాంత్‌కుమార్



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యత అవసరమని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. రిజర్వుబ్యాంకు ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యతపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ 'మంచి ఆర్థిక ప్రవర్తన–మిమ్ములను కాపాడుతుంది' అనే నినాదంతో రిజర్వుబ్యాంకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ, ఎస్‌బీఐ, డీసీసీబీ బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఏనుగుల గుంపు



పసుకుడి వద్ద రోడ్డు దాటుతున్న ఏనుగుల గుంపు

భామిని: భామిని మండలం పసుకుడిలో మకాం వేసిన ఏనుగుల గుంపు సోమవారం ఏబీ రోడ్డుపైకి చేరాయి. దీంతో జనం భయాందోళన చెందారు. కాసేపు రాకపోకలను నిలిపివేశారు. అనంతరం పొలాల్లోకి చేరుకున్న ఏనుగులు పసుకుడికి చెందిన సాసుపిల్లి అప్పలనాయుడు అనే రైతు వ్యవసాయ బోరును ధ్వంసం చేశాయి. మోటారు సెక్షన్ పైపులను ముక్కలుచేసి నీరు తాగాయి. ఈ నెల 6వ తేదీన ట్రేకర్ లక్ష్మీనారాయణను ఏనుగులు తొక్కిచంపిన తరువాత మళ్లీ ఏనుగుల గుంపు హల్‌చల్ చేస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం తలపెడతాయోనన్న బెంగ వారిని వెంటాడుతోంది.


15న డీఈసీ, అల్బెండజోల్ మాత్రల పంపిణీ
● కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో అల్బెండజోల్, డీఈసీ మాత్రలను ఈనెల 15వ తేదీన పంపిణీ చేస్తామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ సోమవారం తెలిపారు. నులిపురుగులు, ఏలిక పాముల నివారణ వల్ల రక్తహీనత సమస్యను అధిగమించేందుకు అల్బెండజోల్, డీఈసీ మాత్రలు దోహదపడతాయన్నారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా మాత్రల పంపిణీపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మందుల పంపిణీ పక్కాగా జరగాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. 15వ తేదీన మందులు తీసుకోని వారికి 16, 17 తేదీల్లో పంపిణీ చేయాలన్నారు. 2 నుంచి 5 సంవత్సరాల వయస్సుగల చిన్నారులతో వంద మిల్లీ గ్రాముల డీఈసీ మాత్ర ఒకటి, నాలుగువందల మిల్లీ గ్రాముల అల్బెండజోల్ మాత్ర ఒకటి మింగించాలన్నారు. 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు రెండు వందల మిల్లీ గ్రాముల డిఈసీ మాత్రలు రెండు, నాలుగు వందల మిల్లీగ్రాముల అల్బెండజోల్ మాత్ర ఒకటి పంపిణీ చేయాలని, 15 సంతవ్సరాల వయస్సు పైబడిన వారికి మూడువందల మిల్లీ గ్రాముల డిఈసీ మాత్రలు మూడు, నాలుగు వందల మిల్లీ గ్రామాల అల్బెండజోల్ మాత్ర ఒకటి అందజేయాలన్నారు. మాత్రల పంపిణీలో అంగన్‌వాడీ, పాఠశాల, కళాశాలల సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు మాట్లాడుతూ రెండేళ్ల వయస్సులోపు పిల్లలకు, గర్భిణులకు, తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న వారికి మాత్రలు వేయరాదన్నారు. కార్యక్రమంలో జేసీ ఒ.ఆనంద్, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అపరాలు కొనుగోలు చేస్తాం
● మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ విమలాకుమారి

విజయనగరం ఫోర్ట్: రబీలో రైతులు పండించిన మినుము, పెసలను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ విమలాకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినుములు క్వింటాకు రూ.6,600, పెసలు క్వింటా రూ.7,755 చొప్పున కొనుగోలు చేస్తామన్నారు. ఈ–క్రాప్‌లో పేరు నమోదు చేసుకున్న రైతుల నుంచి అపరాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

ప్రగతి బాటలు



పార్వతీపురం జిల్లా కేంద్రం వ్యూ

- జాతీయ రహదారులుగా చిలకపాలెం–రాయగడ, కళింగపట్నం–పార్వతీపురం రోడ్డు!
- రూ.1470 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు
- రహదారుల అభివృద్ధితో పర్యాటకరంగ అభివృద్ధికి దోహదం
- వాణిజ్యరంగంలో అభివృద్ధికి అడుగులు
- సులభతరం కానున్న రవాణా

రహదారుల అభివృద్ధి ఇలా..
- చిలకపాలెం నుంచి రాజాం, రామభద్రపురం, బొబ్బిలి, పార్వతీపురం మీదుగా రాయగడ రోడ్డు (125 కి.మీ.)
- కళింగపట్నం నుంచి పాలకొండ, వీరఘట్టం మీదుగా పార్వతీపురం (120 కి.మీ)

పార్వతీపురంటౌన్: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అభివృద్ధికి కృషి జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లాలోని చిలకపాలెం, కళింగపట్నం నుంచి రాయగడ వరకు ఉన్న రెండు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చే ప్రక్రియ ఊపందుకుంది. రూ.1470 కోట్ల అంచనా వ్యయంతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వీటికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపితే నాలుగులైన్ల రహదారులుగా మారనున్నాయి. రాకపోకలు మరింత సులభం కానున్నాయి. వాణిజ్య, పర్యాటక రంగాలు ప్రగతిబాటలో పయనించేందుకు ఆస్కారం కలుగుతుంది. పార్వతీపురం మన్యం జిల్లా మంచి పురోగతి సాధించనుంది.

పర్యాటక రంగ అభివృద్ధికి అవకాశం
పార్వతీపురం మన్యం జిల్లా పర్యాటక ప్రాంతాలకు ఆలవాలం. ఇక్కడి తోటపల్లి రిజర్వాయర్ వద్ద వాటర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో పాటు లేక్‌వ్యూ రీసార్ట్ల నిర్మాణం కోసం, ప్రాజెక్టు పరిసరాల్లోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.20 కోట్లతో అభివృద్ధి చేసేందుకు సంబంధిత అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదించారు. జిల్లాలోని సహజమైన లోయలు, జలపాతాలు, కొండపై దృశ్యాలు, నీటి వనరులు, చారిత్రాత్మక దేవాలయాలు, గిరిజన ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు పర్యాటకులను ఆకర్షిస్తాయి. ఇందులో భాగంగానే సాలూరు, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం మండలాల్లోని పర్యాటకరంగ ప్రాంతాల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. రహదారుల నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం పర్యాటకులను ఆకర్షించడంలో ముందుంటుంది.

145 కిలోమీటర్ల మేర అభివృద్ధి..
చిలకపాలెం నుంచి పార్వతీపురం మీదుగా రాయగడ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డుకు జాతీయ రహదారి హోదా కల్పిస్తే రోడ్డుకు ఇరువైపులా 25 అడుగులతో నాలుగు వరుసల రోడ్డు నిర్మింతంకానుంది. 125 కి.మీ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కలుగుతుంది. అలాగే, కళింగపట్నం నుంచి పార్వతీపురం మీదుగా రాయగడ వరకు రహదారి ఉంది. 120 కి.మీ మేర ఉన్న ఈ రోడ్డును కూడా జాతీయరహదారిగా విస్తరించనున్నారు. ఈ రెండు రోడ్లు పార్వతీపురం మీదుగా వెళ్తాయి. దీనివల్ల కొత్తజిల్లా మరింత అభివృద్ధి కానుందని, అటవీ ఉత్పత్తులు, ఖనిజ సంపదను పోర్టులకు తరలించడం సులభతరమవుతుంది.

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం



అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. సహజ వనరులకు పార్వతీపురం మన్యం పెట్టింది పేరు. జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి సాధించేలా ప్రణాళికలను రూపొందిస్తున్నాం. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా గిరిజన గ్రామాల్లో రీసార్ట్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టాం.
– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

కొత్తజిల్లా నుంచే ఐసీడీఎస్ పాలన

- బలిజిపేట, కొమరాడ, భామిని మండలాల్లో కొత్త ప్రాజెక్టుల ఏర్పాటు
- పాలకొండలో విలీనం కానున్న వీరఘట్టం ఐసీడీఎస్
- పార్వతీపురం మన్యం జిల్లాలో 10 ప్రాజెక్టుల నుంచి కార్యకలాపాలు



పాలకొండలో విలీనం కాబోతున్న వీరఘట్టం ఐసీడీఎస్ కార్యాలయం

వీరఘట్టం: జిల్లాల పునర్విభజనతో తలెత్తుతున్న పాలనాపరమైన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఏ జిల్లా ప్రభుత్వ కార్యాలయం ఆ జిల్లాలోనే ఉండేలా చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ ప్రాజెక్టులన్నీ ఆయా జిల్లాల పరిధిలోకి చేర్చుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల భౌగోళిక స్వరూపం మార్చేందుకు కసరత్తు మొదలైంది. దీనికోసం ఇటీవల ప్రభుత్వం జీఓ నంబర్ 2 ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనివల్ల గతంలో ఉన్న కొన్ని ప్రాజెక్టులు తరలిపోగా, కొత్తగా జిల్లాలో మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఏర్పడనున్నాయి.

ఇదీ పరిస్థితి..
పార్వతీపురం మన్యం జిల్లాలో గతంలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండేవి. వీటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వం కొన్ని ప్రాజెక్టులను పక్క ప్రాజెక్టుల్లో విలీనం చేసింది. పక్క ప్రాజెక్టుల్లో ఉన్న కొన్నింటిని వేరుచేసి కొత్త ప్రాజెక్టులుగా రూపొందించి ప్రస్తుతం 10 ప్రాజెక్టులుగా మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల జిల్లాలో బలిజిపేట, కొమరాడ, భామిని మండలాలు కొత్త ప్రాజెక్టులుగా ఏర్పడ్డాయి. వీరఘట్టం పరిధిలోని వంగర మండలాన్ని రాజాం ప్రాజెక్టులో, వీరఘట్టంను పాలకొండ ప్రాజెక్టులో విలీనం చేసింది. అలాగే, పాలకొండలో ఉండే బూర్జ మండలాన్ని వేరు చేసింది. కొత్తూరు ప్రాజెక్టులో ఉండే భామిని మండలాన్ని వేరుచేసి కొత్త ప్రాజెక్టుగా గుర్తించింది. పార్వతీపురంలో ఉండే కొమరాడ, గరుగుబిల్లి ప్రాజెక్టులను వేరుచేసి కొత్తగా కొమరాడలో ప్రాజెక్టు ఏర్పాటు చేసింది. బొబ్బిలిలో ఉండే బలిజిపేట, సీతానగరం మండలాలను వేరుచేసి కొత్తగా బలిజిపేటను కొత్త ప్రాజెక్టుగా మార్చింది. దీంతో జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టుల భౌగోళిక స్వరూపం పూర్తిగా మారనుంది.

ప్రస్తుతం ఇలా..
ఐసీడీఎస్ ప్రాజెక్టుల భౌగోళిక స్వరూపం మారడంతో పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లోని 10 ప్రాజెక్టుల పరిధిలో 2,064 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 1425 ప్రధాన కేంద్రాలు, 639 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

జిల్లాలోని 10 అంగన్‌వాడీ ప్రాజెక్టులు ఇవే...

ప్రాజెక్టు పేరు	ప్రాజెక్టులో ఉండే మండలాలు
సాలూరు	సాలూరు(అర్బన్), సాలూరు రూరల్
పాచిపెంట	పాచిపెంట, మక్కువ
పార్వతీపురం	పార్వతీపురం(అర్బన్,రూరల్)
బలిజిపేట	బలిజిపేట, సీతానగరం
కొమరాడ	కొమరాడ, గరుగుబిల్లి
కురుపాం	కురుపాం, జియ్యమ్మవలస
భద్రగిరి	గుమ్మలక్ష్మీపురం
పాలకొండ	పాలకొండ(అర్బన్, రూరల్), వీరఘట్టం
సీతంపేట	సీతంపేట
భామిని	భామిని

పాలనాపరమైన సమస్యలు లేకుండా అంగన్‌వాడీ కేంద్రాలన్నీ ఏకతాటిపైకి రానుండడంతో అంగన్‌వాడీ కార్యాలయ సిబ్బంది, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆదేశాలు వచ్చిన వెంటనే...



ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే యథాతథంగా అన్ని కేంద్రాలను పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోకి తీసుకువస్తాం. జిల్లాలో బలిజిపేట, కొమరాడ, భామిని మండలాలు కొత్తగా ప్రాజెక్టులుగా మారాయి.
– కె.విజయగౌరీ, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ

జీవన ప్రయాణం



ఎండైనా.. వానైనా.. కష్టమైనా.. సుఖమైనా.. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్సే వారి జీవన ఆలయం. అక్కడికి వచ్చే ప్రయాణికులే వారి దేవుళ్లు. బస్సుల రాకకోసం అనుక్షణం ఎదురు చూస్తారు. పండ్ల బుట్టలతో పరుగుతీస్తారు. సీజనల్‌గా దొరికే తాజా పండ్లను ప్రయాణికులకు విక్రయిస్తారు. దశాబ్దాల తరబడి ఇదే వృత్తిగా ఓ 70 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. యువతుల నుంచి వృద్ధుల వరకు పండ్ల అమ్మకంతోనే బతుకుబండిని నడుపుతున్నారు. వారి జీవన యానంపై 'సాక్షి' అక్షర రూపం.

- ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పండ్ల అమ్మకాలు
- 70 కుటుంబాలకు అదే జీవనాధారం
- అతి తక్కువ ధరకే అమ్మకాలు
- బయట వ్యాపారుల నుంచి ఒత్తిడి
- ప్రయాణికులే దేవుళ్లుగా ముందుకు సాగుతున్న మహిళలు



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల రాకకోసం ఎదురుచూస్తున్న పండ్ల వ్యాపారులు

విజయనగరం డెస్క్:

విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్సుకు వెళ్లేవారందరికీ ఆ మహిళలు సుపరిచితులు. పండ్ల బుట్టలతో స్వాగతం పలుకుతారు. పండ్లు కొనాలంటూ ప్రాథేయపడతారు. కాంప్లెక్సులోకి వచ్చే ప్రతిబస్సు వద్దకు వెళ్తారు. ప్రయాణికులకు తాజా పండ్లను విక్రయిస్తారు. ఇంత చేసినా వీరికి వచ్చే ఆదాయం రోజుకు రూ.300 నుంచి రూ.500లే. అది కూడా సరుకు అమ్మకం బట్టి డబ్బులు వస్తాయి. వాస్తవంగా గంపగుత్తుగా పండ్లు విక్రయిస్తారు. దీనివల్ల తక్కువ ధరకే పండ్లు లభిస్తాయి. అందుకే.. వీరికి వచ్చే లాభం కూడా అంతంతమాత్రంగానే ఉంటుంది. విజయనగరానికి వచ్చేవారు.. ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా రాకపోకలు సాగించేవారు వీరి వద్దనే ఎక్కువగా పండ్లు కొనుగోలు చేస్తారు. ఎందుకంటే ఏ రోజు పండ్లను ఆ రోజే వీరు విక్రయిస్తారు. మరోవైపు గ్రేడింగ్ చేసి తెస్తారు. బుట్టలో కుళ్లిపోయిన పండ్లు కనిపిస్తే ప్రయాణికులు కొనుగోలు చేయరన్న బెంగతో మంచి పండ్లనే విక్రయిస్తారు.

ఆ రెండు ప్రాంతాల వారే...
కాంప్లెక్స్‌లో పండ్లను విక్రయించే మహిళలందరూ విజయనగరంలోని లంకాపట్నం, జొన్నగుడ్డి ప్రాంతాలకు చెందిన వారే. ఉదయాన్నే మేల్కొంటారు. గంటస్తంభం మార్కెట్‌లోని హోల్‌సేల్ డీలర్ల వద్ద, రైతుల నుంచి పండ్లను కొనుగోలు చేస్తారు. పండ్ల బాక్సులతో మూకుమ్మడిగా కాంప్లెక్స్‌కు చేరుకుంటారు. ఉదయం ఫస్ట్ బస్సు నుంచి మళ్లీ రాత్రి లాస్ట్ బస్సు వరకు వీరి విక్రయాలు సాగుతూనే ఉంటాయి. భగభగ మండే ఎండైనా.. భారీ వర్షం కురిసినా.. గజగజ వణికించే చలిలోనైనా వీరి బతుకుపోరాటం ఆగదు. వీరిలో కొందరికి బస్సువేళలు సైతం కంఠస్తమే. బస్సు రాకపోకల గురించి వాకబుచేసే ప్రయాణికులకు సమాచారం కూడా ఇస్తారు.

సీజనల్ వ్యాపారం..
సీజనల్ వారీగా దొరికే పండ్లనే ఎక్కువగా విక్రయిస్తారు. జామ, సపోటా వంటి పండ్లను విజయనగరంలోని రైతుల నుంచి సేకరిస్తారు. యాపిల్, ద్రాక్ష, దానిమ్మ, బత్తాయి తదితర పండ్లను డీలర్ల వద్ద కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తారు. వీరిలో చాలా మంది నిరక్షరాస్యులు. బుట్టల్లో కిలో పండ్లకు ఎక్కువగానే ఉంచి విక్రయిస్తారు. దీనివల్ల కొన్నిసార్లు నష్టం కూడా వస్తుంది. బుట్టనిండా లేకపోతే కొనుగోలుచేయరన్న బెంగ వారిది.

రోజుకు 2 టన్నుల వరకు విక్రయం..
ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా రోజుకు 123 సర్వీసులు తిరుగుతున్నాయి. సుమారు 40 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతిరోజు సుమారు 1500 కేజీల నుంచి 2వేల కేజీల పండ్ల విక్రయం జరుగుతుందని విక్రయదారులు పేర్కొన్నారు. ఉగాది, దసరా, పైడితల్లి సిరిమానోత్సవం, సంక్రాంతి తదితర పండగల సమయంలో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, ఆ రోజుల్లో కూలి గిట్టుబాటు అవుతుందన్నారు.

ఒత్తిడి అధిగమిస్తూ...
వాస్తవంగా వీరి వద్ద పండ్లు కాస్తచౌక. కిలోకు రూ.5 నుంచి రూ.10 వచ్చినా చాలు విక్రయిస్తారు. వీరు చౌకగా విక్రయించడం వల్ల తమవద్ద పండ్లు కొనుగోలు చేయడంలేదంటూ బయట వ్యాపారుల నుంచి నిత్యం ఒత్తిడి ఉంటుంది. కొందరు బడా వ్యాపారులైతే చర్యలకోసం ఆర్టీసీ అధికారులపై కూడా ఒత్తిడి తెచ్చే పరిస్థితులు ఉన్నాయి. అయితే, పేద కుటుంబాలకు చెందిన మహిళలు కావడం, ప్రయాణికుల నుంచి వీరికి ఆదరణ ఉండడంతో ఆర్టీసీ అధికారులు సైతం వీరి విక్రయాలకు అంతరాయం కలిగించడం లేదు.

కాంప్లెక్స్ ఏర్పడినప్పటి నుంచి..



ఆర్టీసీ కాంప్లెక్స్ ఏర్పడినప్పటి నుంచి మా తల్లిదండ్రులు పండ్లను విక్రయించే మమ్మలను పెంచారు. ఇప్పుడు మాకు కూడా అదే వృత్తిగా మారింది. రోజుకు రూ.300 వస్తే సంతోషపడతాం. కొన్నిసార్లు నష్టం కూడా వస్తుంది. అయినా.. మాకు జీవనాధారమైన ఈ వృత్తిని వదులుకోలేకపోతున్నాం.
– యాగాటి రమణమ్మ, జొన్నగుడ్డి

ఇదే ఆధారం..



ఆర్టీసీ కాంప్లెక్సే మా బతుకులకు ఆధారం. వచ్చే ప్రతి బస్సువద్దకు పరుగుతీస్తాం. పండ్లను చిన్నచిన్న బుట్టల్లో ఒకరు సిద్ధం చేస్తే... మిగిలిన వాళ్లం విక్రయిస్తుంటాం. తిండికి డోకా లేకుండా వ్యాపారం సాగిపోతోంది. అదే మాకు పదివేలు.
– కె.ఆది, లంకాపట్నం

నా చిన్నప్పటి నుంచి..



నా చిన్నప్పటి నుంచి ఇదే వృత్తిగా జీవిస్తున్నా. నాకు 60 ఏళ్లు పైబడినా కాంప్లెక్స్‌కు రానిదే నిద్రపట్టదు. పండ్లను విక్రయిస్తూ నా వంతు కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటున్నా. కొందరు ప్రయాణికులు మా వద్దనే నిత్యం పండ్లను కొనుగోలు చేస్తారు. ఎందుకంటే మేము నాణ్యమైనవే విక్రయిస్తాం. కుళ్లిపోయినవి, పాడైనవి ముందే తీసేస్తాం. ప్రయాణికులు నచ్చిన ధరకు అడిగినా కోపగించుకోము. ఈ వృత్తిలోకి వచ్చే మా పిల్లలకు కూడా ఇదే బోధిస్తాం. ప్రయాణికులను దేవుళ్లగా భావించాలని చెబుతాం.
– సోము బజ్జి, లంకాపట్నం



కాంప్లెక్స్‌లో కలియతిరుగుతూ...



బస్సుల వద్ద పండ్లు అమ్ముతున్న మహిళలు



పండ్లను కొనుగోలుచేసి డబ్బులు ఇస్తున్న ప్రయాణికుడు



కమలా పండ్లు అమ్ముతున్న మహిళ

క్లుప్తంగా

వైభవంగా కోటదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవ పూజలు



సంగంవలసలో కుంకుమపూజల్లో పాల్గొన్న మహిళలు

పార్వతీపురం: మండలంలోని సంగంవలసలో శ్రీ కోటదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవ పూజలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా మహిళలతో కుంకుమపూజలను ఆలయ అర్చకుడు మహేష్ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు స్వచ్ఛందంగా పాల్గొని సేవలు అందించారు.

జీడితోట దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

చీపురుపల్లిరూరల్: మండలంలోని సంకుపాలెం గ్రామానికి సమీపంలో అగ్ని ప్రమాదం సంభవించి జీడితోట దగ్ధమైంది. తోటలో నుంచి విద్యుత్‌లైన్ ఉండడం కారణంగా విద్యుత్ తీగల వద్ద మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం సంభవించిందని బాధిత రైతు రెల్లి మురళి తెలిపాడు. ప్రమాదం సంబవించిన వెంటనే చీపురుపల్లి అగ్నిమాపకశాఖ కార్యాలయానికి సమాచారం అందించడంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారని చెప్పాడు. ప్రమాదంలో జీడితోట దగ్ధమై నష్టపోయానని రైతు వాపోయాడు.

నలుగురు మహిళలకు తీవ్ర గాయాలు

భోగాపురం: భోగాపురం జాతీయ రహదారిపై టాటా ఏస్ వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో నలుగురు మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. సోమవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన కోట్ల రేవతి కనకమహలక్ష్మి, సంగం కరుణ, గుడివాడ కనకమహలక్ష్మి, అనుపూజ నీలిమలు శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పాతర పల్లి పీహెచ్‌సీలో ఎస్‌ఎంఆర్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఈ నలుగురు మహిళలు విధులకు ఆటోలో వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం విశాఖపట్నం నుంచి టాటా ఏస్ వాహనంలో విధులకు బయలుదేరారు. భోగాపురం చేరుకునేసరికి వాహనం అదుపుతప్పి వైడర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాదంలో గాయాలు

పార్వతీపురం/బలిజిపేట: బలిజిపేట మండలం వెంగాపురం గ్రామానికి చెందిన యామల రాణి సోమవారం ఉదయం ఇంటి వద్ద చలిమంట కాగుతున్న సమయంలో మంటలు అంటుకోవడంతో శరీరమంతా కాలిపోయింది. ఈ మేరకు చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

గడ్డివాములకు నిప్పు



సంఘటనా స్థలంలో మంటలు అదుపు చేస్తున్న దృశ్యం

వంగర: మండల పరిధి కొప్పరవలస గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాల్లో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. వరిపంట నూర్పిడి అనంతరం 25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గడ్డివాములకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. సమీపంలో ఉన్న నీలగిరి తోట పాక్షికంగా దెబ్బతింది. జొన్న పంటకు నిప్పంటుకుంటుందేమోనని స్థానిక రైతులు రాజాం అగ్నిమాపక శకటానికి సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజిన్ మంటలను అదుపుచేయడంతో ఎటువంటి ఆస్తినష్టం సంభవించలేదు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹ 180

మనసున మనసై.. బతుకున బతుకై..!

• నేడు ప్రేమికుల దినోత్సవం

చూపులతో మొదలై..హృదయంలో స్థానం సంపాదించి..రెండు మనసులు పెనవేసుకుని తాళి బంధంతో ఒక్కటయ్యే ప్రేమ జంటల జీవితం ఆద్యంతం ఆనందాల హరివిల్లులా సాగిపోతుందనడంలో అతిశయోక్తి లేదు. ప్రేమబంధాన్ని వివాహ బంధంతో ముడివేసి జీవితాన్ని సంతోషంగా ఆస్వాదిస్తున్న ప్రేమైక దంపతులకు ప్రేమికుల దినోత్సవ శుభాకాంక్షలు. జిల్లాలో ఉన్న అటువంటి కొన్ని ప్రేమ జంటల గురించి తెలుసుకుందాం.



స్వీట్లు తినిపించుకుంటున్న శామ్యూల్, సరోజిని దంపతులు

64ఏళ్ల ప్రేమ

బొబ్బిలి మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన యజ్జల శామ్యూల్, రేజేటి సరోజినిల ప్రేమకు 64 ఏళ్లు. 1958, 59లలో ప్రేమించుకున్నారు. వారి రెండేళ్ల ప్రేమ బంధాన్ని 1960లో పెళ్లి బంధంతో ఒక్కటి చేసి దంపతులయ్యారు. అయితే పెళ్లి తరువాత వారి ప్రేమ మరింత చిగురించింది. మిలటరీలో హవల్దార్‌గా శామ్యూల్ 20ఏళ్లు పనిచేసి, తరువాత వ్యవసాయం మీద మక్కువతో స్వగ్రామానికి వచ్చేసి వ్యవసాయం చేసుకుంటూ, వైద్య,ఆరోగ్యశాఖలో ఉద్యోగం సంపాదించారు. వారి ప్రేమకు చిహ్నంగా ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు పుట్టగా, వారందరినీ ఈ ప్రేమజంట ఉన్నతస్థాయిలో నిలిపేందుకు అహర్నిశలూ కృషిచేసి, మంచి స్థితిలో నిలబెట్టారు. వారి సంతానంలో ముగ్గురు విదేశాల్లో స్థిరపడగా ఒక అబ్బాయి ఇదే మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. 2020లో వివాహ షష్టిపూర్తి మహోత్సవం చేసుకున్న ఆ ప్రేమ జంట నేటి యువతరానికి ఆదర్శం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఆదర్శదంపతులు..

అదే గ్రామానికి చెందిన యజ్జలవిజయానంద్‌కుమార్, చిన్నమ్మలు గ్రామంలోనే ఒకరినొకరు ప్రేమించి వివాహం చేసుకున్నారు. దివ్యాంగుడైన విజయానంద్, గ్రామానికి చెందిన చిన్నమ్మలును 18ఏళ్లక్రితం ప్రేమించాడు. ఇద్దరూ పెద్దలకు విషయం చెబితే తొలుత ససేమిరా అన్నప్పటికీ తరువాత వారి ప్రేమను గుర్తించి వివాహం జరిపించారు. దివ్యాంగుడైన విజయానంద్, చిన్నమ్మలు ఎంతో అప్యాయతానురాగాలతో జీవిస్తూ హాయిగా ఉన్నారు. వారి ప్రేమకు గుర్తుగా కుమార్తె ఆశాజ్యోతి, కుమారుడు సూర్యనాగచైతన్యలు ఉన్నారు. ప్రేమకు వైకల్యం అడ్డుకాదని ఈ జంట నిరూపించింది.

ఒకరిమీద ఒకరికి నమ్మకం



విజయనగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసించే రోజుల్లో విజయనగరానికి చెందిన ఆర్.శరణ్ అన్నవరం దగ్గర మూరుమూల గ్రామానికి చెందిన జ్యోతిల మధ్య ప్రేమ బలపడింది. విజయనగరంలో హాస్టల్‌లో ఉంటూ అభ్యసిస్తున్న జ్యోతి దగ్గరకు నేరుగా శరణ్ వెళ్లి నువ్వంటే ఇష్టమని చెప్పాడు. సమాధానం లేదు. ఏం చేయాలో తెలియక పెళ్లెప్పుడు అని అడిగాడు. సమాధానం లేదు. వారిద్దరి మధ్య చూపులతోనే పాలిటెక్నిక్‌లో రెండో ఏడాది గడిచిపోయింది. మూడో సంవత్సరం వచ్చేసరికి గ్రీటింగ్ కార్డు పట్టుకుని శరణ్ దగ్గరకు జ్యోతి వచ్చి నిన్ను ఇష్టపడుతున్నా అనిచెప్పింది. ఎన్నో రోజులుగా వెయిట్ చేస్తున్న శరణ్ పెళ్లి ఎప్పుడు చేసుకుందామని ఆమెను అడిగాడు. అలా ఇద్దరి మనసులు కలవడంతో 2014 నవంబరు 24న ఆలయంలో వారి పెళ్లిజరిగింది. ఇప్పటికి పెళ్లయి తొమ్మిదేళ్లు గడిచాయని కష్టసుఖాల్లో ఒకరికొకరం తోడుగా ఉంటూ సంతోషంగా ఉన్నామని ఆ దంపతులు చెబుతున్నారు.

– ఆర్.శరణ్ జ్యోతి దంపతులు, విజయనగరం

పెద్దల అంగీకారంతో ప్రేమ పెళ్లి



డిగ్రీ చదువుతున్న రోజుల్లో తనను ఇష్టపడ్డాను. ఆమె ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు పూర్తిచేసుకుంది. నేను ప్రైవేట్ జాబ్ చేస్తున్నాను. మా ఇద్దరి కులాలు వేరైనప్పటికీ మా కుటుంబసభ్యులందరూ ప్రేమపెళ్లిని అంగీకరించడంతో వారి సమక్షంలోనే మే 20, 2019లో ఒకటయ్యాం. మాకు పాప అద్వితా శ్రేష్ఠ, బాబు ఇవాన్ ఆషేర్‌లు ఉన్నారు. అన్నిరకాలుగా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉండడంతో చాలా ఆనందంగా ఉన్నాం.

– టి.గౌతమ్ బ్యూలా, విజయనగరం

అర్జీలు వెంటనే పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట రావు ప్రజల నుంచి 90 అర్జీలు స్వీకరించారు.

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలివ్వించాలి

పార్వతీపురం మండలం పుట్టూరు గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్‌లకు గత 11 నెలలుగా జీతం అందడంలేదని, తక్షణం జీతం ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

పట్టాలు మంజూరు చేయాలి

మక్కువ మండలం లోతుగడ్డకు చెందిన పలువురు రైతులు సర్వే నంబర్ 164లో సాగుచేస్తున్న భూములకు పట్టాలను మంజూరుచేయాలని వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథ రావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీజీ కృష్ణాజీ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలి

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వారి సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ ఎస్పీ సీఐ ఎస్.శ్రీనివాస రావు, ఎస్సై దినకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు గడువులోగా పరిష్కరించాలి

• కలెక్టర్ సూర్యకుమారి



అర్జీలను వింటున్న కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో అందిన వినతులు పెండింగ్ పెట్టకుండా గడువులోగా పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను అనంతరం కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 110 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 82 ఉన్నాయి. హౌసింగ్‌కు 7, మున్సిపల్ శాఖకు 2, మిగిలిన ఇతర శాఖలకు చెందిన వినతులు9, పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మావతి, సూర్యనారాయణ, దొర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. .

దేవాలయాలపై జరిగిన దాడిని అరికట్టాలి

జిల్లాలోని దేవాలయాలపై ఇటీవల జరుగుతున్న దాడిని అరికట్టాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం కమిటీ సభ్యులు కలెక్టర్ సూర్యకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విశ్వహిందూ పరిషత్, హిందూ ధర్మ రక్ష సమితి, రామరాజ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు సత్వరన్యాయమందించాలి

విజయనగరం టౌన్: స్పందన ఫిర్యాదు దారులకు సత్వరన్యాయమందించాలని విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చట్టపరిధిలో చర్యలు చేపట్టి , బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. స్పందనలో భాగంగా 21 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలుచేపట్టారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ సీహెచ్.రుద్రశేఖర్, జి.రాంబాబు, ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు కలెక్టర్ అభినందనలు



కరాటే విజేతలతో కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: కరాటే విజేతలను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ సోమవారం తన కార్యాలయంలో సోమవారం అభినందించారు. విశాఖపట్నంలో జరిగిన 6వ అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్‌లో విజేతలుగా నిలిచిన ఆరేళ్ల లోపు విభాగంలో బి.తమన్‌రాజ్(రజతం), తొమ్మిదేళ్ల లోపు విభాగంలో ఎం.కార్తికేయ (రజతం), ఏడేళ్లలోపు విభాగంలో కె.ఆకాష్ (కాంస్యం), ఎనిమిదేళ్లలోపు విభాగంలో ఎం.యువజాజ్ (కాంస్యం)పతకాలను పొందారు. ఈ మేరకు కలెక్టర్ ప్రత్యేకంగా ఆ విద్యార్థులను అభినందించి కోచ్‌లను ప్రత్యేకంగా ప్రశంసించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

• వైద్యుల నిర్లక్ష్యమంటూ బంధువుల ఆందోళన



రాములమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

విజయనగరం ఫోర్ట్: మండలంలోని జొన్నవలస గ్రామానికి చెందిన కోరాడ రాములమ్మ (73) ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. అయితే ఆస్పత్రి వైద్యులు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం చేయడం వల్ల రాములమ్మ చనిపోయిందని బంధువులు ఆందోళన చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోటలోని బంధువుల ఇంటి వద్ద రాములమ్మ ఉంటోంది. మధుమేహంతో బాధపడుతున్న ఆమెకు మూత్రం బంధించడంతో ఎస్.కోట ఆస్పత్రికి ఆదివారం ఉదయం తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం సర్వజన ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేయడంతో విజయనగరంలోని సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. దీంతో బంధువులు కాసేపు ఆందోళన చేశారు. ఇదేవిషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ శంబంగి అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా రాములమ్మకు చికిత్స అందించడంలో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని చెప్పారు. ఆస్పత్రిలో చేర్పించిన తర్వాత ఆమె పరిస్థితి విషమంగా ఉందని బంధువులకు వివరించామని చెప్పారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న కార్తికేయ



చికిత్స పొందుతున్న అప్పారావు

పార్వతీపురం: సీతానగరం మండలం పాపమ్మవలస గ్రామానికి చెందిన వంగపండు కార్తీక్, స్నేహితుడు పవన్‌లు ఎస్‌వీడీ కళాశాల నుంచి పాపమ్మవలస బైక్‌పై వస్తుండగా కొత్తవలస దుర్గమ్మ గుడి వద్ద ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ఘటనలో కార్తీక్‌కు పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

బస్సు ఢీకొని మరొకరికి..

గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామానికి చెందిన ఎన్. అప్పారావు రైస్‌మిల్లులో పనిచేసి విధులను ముగించుకుని ఇంటికి వెళ్తున్న తరుణంలో పార్వతీపురం నుంచి వీరఘట్టం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తల, కన్ను, నడుముకు గాయాలయ్యాయి. గాయపడిన అప్పారావును 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

గొట్లాం విద్యార్థుల ప్రతిభ

• రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో జిల్లాకు 3వ స్థానం



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: శాప్ ఆధ్వర్యంలో బాలుర విభాగంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లాకు 3వ స్థానం దక్కినట్లు గొట్లాం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీరామాచారి, పీడీ యు.సత్యానందలు తెలిపారు. కృష్ణా జిల్లాలోని హనుమాన్ జంక్షన్‌లో ఈనెల 11, 12 వతేదీల్లో రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు తరఫున గొట్లాంలోని జెడ్పీ హైస్కూల్ నుంచి కె.హరి, కె.సందీప్‌లు పాల్గొని ప్రతిభ కనబరిచి 3 స్థానంలో జట్టు నిలవడానికి కృషి చేసి మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలు అందుకున్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు



స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు సత్తా చాటారు. కృష్ణా జిల్లా ఈడ్పుగల్లులో జరిగిన పోటీల్లో 10 పతకాలు సాధించగా..వాటిలో 3 బంగారు, ఒక సిల్వర్, 6 కాంస్య ఉన్నాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు, జట్టు కోచ్ అండ్ మేనేజర్‌లు పీవీఎస్ఎన్‌రాజు, సూర్యనారాయణలను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్‌వీ రమణ అభినందించారు.

సీనియర్స్ తైక్వాండో పోటీల్లో జిల్లా సత్తా



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన సీనియర్స్ తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించారు. ఈనెల 12న తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జరిగిన 38వ సీనియర్స్ అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు మొత్తం 11 పతకాలు చేజిక్కించుకున్నారు. వారు సాధించిన పతకాల్లో ఒక బంగారు, నాలుగు వెండి, ఆరు కాంస్యం ఉన్నాయి. అంతేకాకుండా ఓవరాల్ చాంపియన్ షిప్‌లో తృతీయస్థానం దక్కించుకున్నారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురానఅయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు అభినందించారు.

రాష్ట్రవాలీబాల్ పోటీలకు బింధుమాధవి ఎంపిక



సంతకవిటి : క్రీడాకారిణిని అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

సంతకవిటి: ఈనెల 14 నుంచి గుంటూరులోని నరసరావుపేటలో జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు సంతకవిటి మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కర్రి బింధుమాధవి ఎంపికైంది. అండర్–14 విభాగంలో ఆమె ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.సన్నిబాబు తెలిపారు. ఆ విద్యార్థినిని హెచ్‌ఎం వజ్జా వెంకటరావు, పంచాయతీ సర్పంచ్ డోల తిరుపతి, పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

రసవత్తరంగా ముగిసిన నాటిక పోటీలు



మృత్యువ్రతం నాటికలో సన్నివేశం



ఎన్‌టిఆర్ విశిష్ట పురస్కారం అందుకుంటున్న బుద్దాల వెంకట రామారావు

విజయనగరం టౌన్: నాటకశాల– అభినయ సంయుక్త నిర్వహణలో నటరత్న నాటక పరిషత్ ఆధ్వర్యంలో 7వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు గురజాడ కళాభారతి ఆడిటోరియంలో సోమవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ పౌరాణిక పాత్రలకు సజీవ రూపకల్పన చేసిన ప్రపంచ స్థాయి మహానటుడు ఒక్క ఎన్‌టి.రామారావు మాత్రమేనన్నారు. అనంతరం ఎన్‌టీఆర్ విశిష్ట రంగస్థల పురస్కారాన్ని తాడేపల్లి గూడెం బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావుకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు నడిపేన శ్రీనివాసరావు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ముచ్చి రామలింగస్వామి, నాలుగెస్సుల రాజు, డాక్టర్ వీఎస్.ప్రసాద్, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు అభినయ శ్రీనివాస్, గెద్ద వరప్రసాద్, అధిక సంఖ్యలో కళాభిమానులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన నాటికలు

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మద్దుకూరి క్రియేషన్స్ మద్దుకూరి రవీంద్ర రచన, దర్శకత్వంలో నిర్వహించిన 'మృత్యువ్రతం' నాటిక ఆద్యంతం ఆలోచింపజేసింది. అనంతరం చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వంలో గుంటూరు జిల్లా కత్రపాడు ఉషోదయ కళానికేతన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'ప్రక్షాళన' నాటిక రక్తికట్టించింది.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

పాచిపెంట: మండలంలోని పాంచాలి గ్రామానికి చెందిన గన్ను సోమశేఖర్(28) మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. సోమశేఖర్‌కు ఇటీవల పెళ్లి కుదిరింది. తనకు ఆ వివాహం ఇష్టంలేదనే విషయం ఇంటివద్ద చెప్పలేక మనస్తాపానికి గురై ఈనెల 10వతేదీన ఇంటినుంచి బయటకు వెళ్లిపోయాడు, విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సోమశేఖర్ కోసం చాలాచోట్ల వెతికారు. అయితే గ్రామ శివారులో ఉన్న ఎయిర్‌టెల్ టవర్ కేబుల్ రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సోమవారం ఆటుగా వెళ్లిన గ్రామస్తులు కొందరుచూసి కుటుంబసభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు.